# ఉపకోశలుడు

డి. శ్రీధరబాబు

**సత్యకామ** జాబాలుని ఆశ్రమంలో ఉపకోశలుడు శిష్యరికం చేస్తూ పండ్రెండు సంవత్సరాలు నివసించాడు. తదేకదీక్షతో గురువర్యునికి పరిచర్య చేసినాడు. అయినా ఆయన కటాక్ష వీక్షణాలు ఉపకోశలునిమీద ప్రసరించటానికి సమయం రాలేదు. పెక్కుమంది సత్యకాముని చేరవచ్చారు. సత్యకాముడు వారి వారి అర్హతలను అనుసరించి ఉపదేశించి ఇంటికి పంపివేశాడు. కాని ఉపకోశలునికిమాత్రం ఆశ్రమం విడిచి పెట్టటానికి, గృహోన్ముఖుడు కావటానికి అంగీకారం ఇవ్వలేదు. సత్యకాముని భార్య జాలి కలిగి భర్తతో ఇలా అన్నది : "స్వామీ! ఆ బ్రహ్మచారి తపోపవాస నియమాలను కఠినంగా అనుసరిస్తూనే వస్తున్నాడు. అగ్నిహోత్ర విధులనుకూడ సక్రమంగా నిర్వర్తిస్తూనే ఉన్నాడు. అతనికి ఉపదేశింపవలసినది ఉపదేశించి యింటికి పంపండి."

సత్యకాముడు మౌనం వహించాడు. పైగా ఆశ్రమాన్ని విడిచి ఏదో పనిమీద మరొక చోటికి ప్రయాణం కట్టాడు కూడా.

ఉపకోశలుడు విచారసాగరంలో మునిగిపోయాడు. తిండి తిప్పలు లేకుండా మనస్సులో కలతచెందాడు. చివరకు రోగగ్రస్తుడయ్యాడు. గురువుగారి భార్య ఇదంతా చూచి బాగా బాధపడింది. మాతృభావంతో, "నాయనా! ఉపకోశలా! అన్నం నీళ్ళు లేకుండా ఏం చేస్తావయ్యా? ఇదిగో ఆహారం తీసుకో" అని బ్రతిమాలింది. ఉపకోశలుడు — "అమ్మా! నా హృదయం ఇంకా పవిత్రం కాలేదు. ఇంకా ఈ అభాగ్యునిలో ఎన్నో అపవిత్రమైన సంక






## ప్రవేశమా? నిష్క్రమణమా?

రాజీనామా ఇచ్చిన మంత్రులలో కొందరికి మరల ఆహ్వానాలు రావచ్చు — వార్త.

ల్పాలు గూడుకట్టుకొని ఉన్నాయి. రోగం నన్ను పీడిస్తున్నది. నేను అన్నం ముట్టలేను" అని సమాధానం చెప్పాడు.

తరువాత ఆశ్రమంలో జ్వలిస్తున్న అగ్నులు తమలో తాము ఇలా అనుకొన్నాయి : "ఈ బ్రహ్మచారి దీక్షాపరతంత్రుడై పండ్రెండు సంవత్సరాలు ఏకధారగా తపస్సు ఆచరించాడు. మనలను చక్కగా ఆరాధించి శాస్త్రోక్తంగా సంతృప్తిపరిచాడు. పదండి. మనం అతనికి ఉపదేశం చేద్దాం." ఇలా అనుకొని ఉపకోశలుని వద్దకు బయలుదేరాయి.

ఆ అగ్నులలోనుంచి సందేశం ఇలా వినబడింది: "ఉపకోశలా! ప్రాణమే బ్రహ్మమని, ఆనందమే బ్రహ్మమని, ఆకాశమే బ్రహ్మమని తెలుసుకో."

ఉపకోశలుడు అది విని "నాకు ఇదివరకు ప్రాణం బ్రహ్మమని తెలుసు. ఆనందాకాశాలు బ్రహ్మతత్త్వమని నాకు తెలియదు" అని అగ్నులతో అన్నాడు. అగ్నులు అతనికి హృదయాకాశాన్ని గురించి వివరించాయి. ఆ హృదయపద్మమందే ఆ బ్రహ్మతత్త్వం వసిస్తున్నదని, ఆనందం ఆ తత్త్వం సహజస్వరూపమని అభివర్ణించాయి. ఆ అగ్నులలో ఒక అగ్ని, "పృథివి, సూర్యచంద్రాదులు ఆ బ్రహ్మతత్త్వం రూపాంతరాలే. సూర్యునిలో ఉన్న బ్రహ్మతత్త్వం, నాలో ఉన్న బ్రహ్మతత్త్వం ఒక్కటే. తూర్పు పడమరలలో, ఉత్తర దక్షిణాలలో, నక్షత్రాలలో, జలములలో ఉన్న తత్త్వం, నాలో ఉన్న తత్త్వం ఒక్కటే. ఆకాశంలో మెరిసే మెరుపుతీగను నివాసం చేసుకొన్న తత్త్వం, నాలోని తత్త్వం ఒక్కటే. అన్ని చోట్లా వ్యాపించి ఉన్నది ఆ తత్త్వమే. ఈ విశ్వమునందు అంతటా నిగూఢమై ఉన్నది ఆ తత్త్వమే. ఈ తత్త్వం తెలుసుకొని బాధ లన్నిటినీ దూరం చేసుకో. ఏ విధమైన హానీ లేక సుఖంగా జీవించు" అని ఉపదేశించింది.

తర్వాత నిత్యం గృహస్థులు ఆవాహనచేసి అర్చించుకొనే ఆ గార్హపత్యాగ్ని కొత్త రూపాన్ని పొంది అంతటా వ్యాపించి బ్రహ్మతత్త్వంగా అతనికి ద్యోతమానమైంది. భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, విద్యుల్లతలు, ఒకటేమిటి సర్వవిశ్వమూ అతనికి అగ్నిరూపమై బ్రహ్మరూపమై సాక్షాత్కరించినాయి.

ఆఖరికి ఆ అగ్నులన్నీ కలిసి, "ఉపకోశలా! మావద్దనుండి కొంతవరకు ఈ ఆత్మవిజ్ఞానాన్ని, బ్రహ్మవిజ్ఞానాన్ని నీవు గ్రహించావు. ఇంకా నీ గురువర్యుడు సత్యకాముడు నీకు ఉపదేశం చేస్తాడు" అని చెప్పి ముగించినాయి.

సత్యకాముడు ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. "నాయనా! ఉపకోశలా!" అని పిలిచాడు.

ఉపకోశలుడు "ఏమి స్వామీ!" అని అంటూ చెంతకు వచ్చి నిలిచాడు.

సత్యకాముడు శిష్యుని ముఖం చూచి, "ఉపకోశలా! నీ ముఖమండలం బ్రహ్మనుభూతిని పొందినవానివలె తేజోగోళంగా వెలిగిపోతున్నది. ఆ తత్త్వాన్ని గురించి నీకు ఎవరు బోధ చేశారయ్యా?" అని ప్రశ్నించాడు.

ఉపకోశలుడు జరిగినదంతా చెప్పాడు. సత్యకాముని ఆనందానికి మేరలేదు. అతడు సంతుష్టుడై, "నాయనా! నీవు నేర్చుకొన్నది పరమోత్కృష్టమైన సత్యవిజ్ఞానం. నేను నీకు ఉపదేశించేది కూడా ఆ పరతత్త్వాన్ని గురించిన పరమసత్యమే. గ్రహించు. తామరాకుకు నీటిబొట్లు అంటనిరీతిగా మనస్సును దుష్టభావప్రభావానికి లోనుకాకుండా బ్రహ్మనుభూతి పొంది ఆనందించు" అని తనవద్ద ఉన్న విజ్ఞాన సర్వస్వం శిష్యునికి అందించి ఇంటికి పంపాడు.

(ఛాందోగ్యోపనిషత్తు నుంచి)